కూలిన కల్వర్టు..తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

కూలిన కల్వర్టు వద్ద రాయిని పెట్టిన స్థానికులు

స్థానిక నువ్వులగుంట వీధికి వెళ్లే రహదారిలో కల్వర్టు కప్పు కూలిపోయి నెలలు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదు. వాహనాలపై వెళ్లేవారు ప్రమాదాల భారిన పడుతున్నారు. దీంతో స్థానికులు కూలిన కప్పురాయి స్థానంలో పెద్ద బండ రాయిని ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

- నిబంధనలకు పాతరేస్తున్న వ్యాపారులు
- బెల్ట్ షాపుల్లోనూ అన్ని బ్రాండ్లు
- పట్టని ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మద్యం అమ్మకాలు మూడు పువ్వులు, ఆరు బీరులు అన్నట్లుగా విచ్చలవిడిగా సాగిపోతుంది. తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకని ప్రదేశాల్లో సైతం అన్ని వేళల్లోనూ మద్యం అందుబాటులో ఉంటుంది. కూటమి ప్రభుత్వ పాలనలో మద్యం అమ్మకాలు ప్రయివేటుకు ఇచ్చేయడంతో ఎనీటైమ్ మందు ఎక్కడపడితే అక్కడ లభిస్తుంది. మద్యం వ్యాపారంలో ఆరితేరిన వ్యాపారులు నిబంధనలకు పాతరేస్తూ దర్జాగా వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

కాకినాడ జిల్లాలో 155 ప్రయివేటు మద్యం దుకాణాలు, 20 బార్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 169 షాపులు, 10 బార్లు, తూర్పు గోదావరి జిల్లాలో 154 దుకాణాలు, 19 బార్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకి రూ.13 నుంచి 15 కోట్లు వరకూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. కొత్త మద్యం పాలసీ అందుబాటులోకి వచ్చిన తర్వాత కాకినాడ, రాజమహేంద్రవరం, తుని, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, అమలాపురం, మండపేట, రామచంద్రపురం పట్టణాలు, ఇతర ముఖ్య మండలాల్లో మద్యం వ్యాపారాలు జోరందుకున్నాయి. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో మరింతగా ఈ వ్యాపారం పెరిగే పరిస్థితి నెలకుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే మద్యం అమ్మకాలు జరగాలి. అయితే పలుచోట్ల రాత్రి 12 గంటలయినా లైసెన్స్ షాపులు తెరిచేవుంటున్నాయి. దీనికితోడు జిల్లా వ్యాప్తంగా ఆయా షాపులకు అనుసంధానంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల ద్వారా యథేచ్ఛగా 24 గంటలూ అమ్మకాలు సాగిస్తూ వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. సమయం మించిపోయిన తర్వాత ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ఎనీ టైం మందును అందుబాటులో ఉంచుతున్నారు. పర్మిట్ రూములు లేకపోయినా సిట్టింగ్‌లు పెట్టి విక్రయాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. విచ్చలవిడిగా వ్యాపారాలు జరుపుతున్నా పట్టించుకునే నాథులే లేరని ప్రజలు విమర్శిస్తున్నారు. లైసెన్స్ షాపులకు వెనుక భాగంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి షాపులు మూసిన తరువాత కూడా మద్యం విక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ధనార్జనే ధ్యేయంగా..

మద్యం వ్యాపారులు కొన్ని చోట్ల సిండికేట్‌గా మారి ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం సాగిస్తున్నారు. అధికార పార్టీ నేతలు సిండ్ కేట్లకు నాయకత్వం వహిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఫలితమే మందు వ్యాపారానికి అడ్డు అదుపు లేకుండా పోతుందని పరిశీలకులు భావిస్తున్నారు. అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండడంతో రూ. కోట్లలో వ్యాపారం జరుగుతుంది. దీంతో రూ. లక్షల్లో సొమ్ములు చేతులు మారుతుండడంతో అధికారులు పట్టన్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

అధిక ధరలకు అమ్మకాలు

వేళాపాల లేకుండా 24 గంటలూ విక్రయాలు జరుపుతున్న సిండికేట్ దారులు ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పి ధరలను మించి కొన్ని చోట్ల అమ్మకాలు జరుపుతున్నారు. నేరుగా షాపుల్లో కాకుండా బెల్ట్ ద్వారా అమ్మిస్తూ సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. క్వార్టర్‌పై రూ.20 నుంచి 30 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇలా జిల్లాలో పలు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా వ్యాపారాలు సాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

బెల్ట్ షాపుల జోరు

మద్యం బెల్ట్ షాపుల్లో జోరుగా విక్రయాలు జరుగుతున్నా సంబంధిత ఆబ్కారీ శాఖ అధికారులు పట్టనట్లే వదిలేస్తున్నారు. లైసెన్సులు కలిగిన షాపులకు అనుబంధంగా వందల సంఖ్యలో బెల్ట్ షాపులు జోరుగా నడుపుతున్నారు. కాకినాడ జిల్లాలో అధికంగా ఇవి ఉన్నట్లు అధికారులే చెబుతుండడం గమనార్హం. రాజకీయ నాయకుల అండదండలతో పలు చోట్ల ఇవి కొనసాగుతున్నాయి. దీంతో ఒత్తిళ్ల నడుమ వాటిని తొలగించేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. మరోవైపు కొందరు ఎక్సైజ్ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

రాఘవులును గెలిపించాలని కోరుతున్న కౌలు రైతు సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు

పిడిఎస్ అభ్యర్థి రాఘవులును గెలిపిద్దాం

ప్రజాశక్తి - కాజులూరు

శాసనమండలిలో రాష్ట్ర ప్రజల సమస్యలపై నిలదీసే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులును గెలిద్దామని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కోలంక, కుయ్యేరు గ్రామాల్లో డివి.రాఘవులును గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలుసుకుని డివి.రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి పిడిఎఫ్ ఎంఎల్‌సిగా ఐ.వెంకటేశ్వరరావును పట్టభద్రులు గెలిపించారని, ఫలితంగా అనేక ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డివి.రాఘవులు ప్రజా ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారని అన్నారు. మండలిలో ప్రజల గొంతుకను ప్రతిబింబిస్తారని అన్నారు. మండలి వేదికగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు బుడితి ప్రభాకర్‌రావు, నామాచంద్రరావు, పోతుల మహాలక్ష్మిరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్ -2 పరీక్ష

ప్రజాశక్తి - కాకినాడ, గండేపల్లి

కాకినాడ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ మల్లిబాబు

జిల్లాలో 12 కేంద్రాల్లో జరిగిన గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా యంత్రాంగం పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా జరిగాయి. 12 కేంద్రాల్లో ఉదయం 9379 మంది అభ్యర్థులకు 8167 మంది అభ్యర్థులు హాజరు కాగా 1212 మంది పరీక్షకు హాజరు కాలేదు. 86.06 శాతం, మధ్యాహ్నం 9379 మంది అభ్యర్థులకు గాను 8163 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా 1216 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదు. 85.94 శాతం మంది అభ్య ర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎపిపిఎస్‌షి మెంబర్ సోనీ వుడ్, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు జెఎన్‌టి యుకెలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అలాగే గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన 6 సెం టర్లలో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరి గాయి. ఈ సందర్భంగా ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తమ ప్రాంగణంలో నిర్వహించిన గ్రూపు -2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

సైబర్ నేరగాళ్ల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సిఐ ఎం.అప్పలనాయుడు అన్నారు. ఆదివారం ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల్లో సైబర్ సెక్యూరిటీ, మాదకద్రవ్యాల వ్యతిరేకతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ పట్ల అప్రమత్తంగా ఉంటూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరగాళ్లు ఎంచుకుంటున్న కొత్త మార్గాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. డిజిటల్ అరెస్ట్ అనే మాట ఫేక్ అని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని , బెట్టింగ్ యాప్‌లలో పాల్గొనవద్దని అన్నారు. కళాశాలలో డిఎఫ్‌ఎపి, ఎన్ఎస్ఎస్ ద్వారా తరచుగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, ఐ.గౌరీప్రియ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐ అప్పలనాయుడు

డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

సస్పెన్షన్‌ను నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక ఆర్‌టిసి డిపో డ్రైవర్ ఎస్‌వి.రమణను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఆర్‌టిసి యూనియన్ల జెఎసి ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఆదివారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన కార్మికులు భోజన విరామ సమయంలో గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు యుబిఎం.కుమార్, కె.త్రిమూర్తులు, ఎన్.ప్రకా శరావు మాట్లాడుతూ డ్రైవర్ ఎస్‌వి.రమణను 1/2019కు వ్యతిరేకంగా డిపో మేనేజర్ అక్రమంగా సస్పెండ్ చేశారని అన్నారు. వెంటనే సస్పెన్షన్‌ను వెనుకకు తీసుకుని డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్‌టిసి యూనియన్ల జెఎసి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్, ఎన్ఎంయు, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

శ్రీశైలంకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మహాశివరాత్రి పురస్కరించుకుని శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ జివి.సత్యనారాయణ తెలిపారు. ఈనెల 25 మంగళవారం ఉదయం 4 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరి 26వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఏలేశ్వరం తిరిగి వస్తాయన్నారు.

ప్రజల సంపదను దోచుకుంటున్న కార్పొరేట్లు

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్ర రాష్ట్రంలో కృష్ణా, గోదావరి బేసిన్లో సహజ వాయువు, చమురు, ఖనిజ సంపద కార్పొరేట్ సంస్థలు దోసుకుపోతున్నాయని కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు వైవిఎన్ మహాదేవ్ ఆరోపించారు. ఆదివారం స్థానిక గాంధీభవన్లో చమురు సహజవాయువు, ఖనిజాలు, ప్రకృతి వనరులపై ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కులను కాపాడేందుకు సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహాదేవ్ మాట్లాడుతూ కేజీ బేసిన్లో బొంబే కంటే చమురు నిల్వలు అత్యధికంగా ఉన్నాయని, ప్రపంచంలోనే అతిపెద్ద చమురుక్షేత్రం ఆంధ్రప్రదేశ్లో ఉందన్నారు. కార్పొరేట్ సంస్థలు రూ.60 లక్షల కోట్ల చమురు నిల్వలను పట్టుకెళ్ళిపోతున్నాయని అన్నారు. ఓపెన్ ఎకరా లైసెన్సింగ్ పాలసీతో ప్రభుత్వాలు సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నాయని, ఏడాదికి రూ.రెండు లక్షల 50 వేల కోట్లు కార్పొరేట్ సంస్థలు తీసుకెళ్తున్నాయని తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 38, 39బి ప్రకారం సహజ వనరులు ఏ ప్రాంతంలో తీసిన ఆ ప్రాంత అభివృద్ధికి 30 శాతం ఖర్చు చేయాలని నిర్ధేశించారని అన్నారు. కానీ పాలకులు రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇదే కొనసాగితే కోనసీమ ప్రాంతంలో 40 వేల ఎకరాల్లో భూములు పండకుండా ఉప్పు భూములుగా మారిపోతాయని మహాదేవ్ ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ యజమానులు లక్షల కోట్లు ఆర్జించి కుబేరులు అవుతున్నారని, రాష్ట్రం మాత్రం అప్పుల్లో మునిగిపోతుందన్నారు. సహజ వనరులు విస్తారంగా ఉన్నాయని ఈ ప్రాంత అభివృద్ధికి నోచుకోకుండా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి లేకుండా ప్రయివేటు వ్యాపారస్తులు చేస్తున్నారన్నారు. నేడు ప్రజలు భయం గుప్పెట్లో జీవిస్తున్నారని, దీనిని ఎదుర్కొనేందుకు విద్యార్థులు, మేధావులు, విద్యావంతులు, ప్రజలు, పెద్ద ఎత్తున ముందుకు రావాలని ఆయన కోరారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక దార్శనికుడని, ఆయన రచించిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి పాలకులు స్వలాభం కోసం కార్పొరేట్ వ్యవస్థలను ప్రోత్సహిస్తున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గెయిల్, ఒఎన్‌జిసి వంటి సంస్థలు వంద పడకలు ఆసుపత్రులు నిర్మిస్తామని చెప్పి నేటికి నెరవేర్చలేదన్నారు. 12వ ప్లానింగ్ కమిషన్ సహజ వనరులు వెలికి తీసిన రాష్ట్రాలలో 50 శాతం నిధులు ఆ రాష్ట్ర అభివృద్ధికి కేటాయించాలని చెప్పిన నేటికీ అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కినేని వనజ, ప్రముఖ న్యాయవాది జవహర్ ఆలీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దేగ ప్రభాకర్, తాటిపాక మధు,కామిరెడ్డి బోడకొండ, టిడిపి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, కౌన్సిల్ నాయకులు సత్తిబాబు, సుబ్బరాజు, కోణాల భీమారావు, పెద్దబ్బాయి, తోకల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సిపిఐ నేత ముప్పాళ్ళ నాగేశ్వరరావు

అసౌకర్యం లేకుండా చర్యలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

మహాశివరాత్రికి వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ ఆదేశించారు. శనివారం స్థానిక శివాలయం సమీపాన గల ఏలేరు నది వద్ద శివరాత్రికి చేస్తున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలేరు నది సమీపాన శివాలయం ఉండడంతో పెద్ద ఎత్తున యాత్రికులు తరలి వస్తారన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ, మున్సిపల్, పోలీస్, ఇతర శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబు, వార్డు కౌన్సిలర్లు బొద్దిరెడ్డి గోపి, మూదీ నారాయణస్వామి, పింద్రాల శ్రీను, యండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, మాజీ జడ్‌పిటిసి జ్యోతుల పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

అన్నదానాన్ని పర్యవేక్షిస్తున్న ఎసి విజయలక్ష్మి

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో ఈ అన్నదానాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆసాదులు విజయ్‌కుమార్, నాని, వేద పండితులు శంకర్ శాస్త్రి, వెంకట శాస్త్రి, ప్రసాద శాస్త్రి, శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. ఆదివారం ఉప్పాడ బీచ్ రోడ్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపినా, ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ప్రయాణించినా చర్యలు తప్పవన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపిన వారికి జరిమానా విధిస్తామని అన్నారు. మైనర్లకు ద్విచక్రవాహనాలను ఇవ్వవద్దని తల్లీదండ్రులకు సూచించారు. ద్విచక్రవాహనం నడిపే వారి వద్ద సంబంధిత డ్రైవింగ్ లైసెన్స్, సీ బుక్, ఇతర పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన పలువురికి జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో హెచ్‌సి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శత వసంతాల వేడుక

ప్రజాశక్తి - సామర్లకోట

1924లో జడ్‌పి ఎంపిహెచ్ఎస్ పాఠశాలగా ప్రారంభమై అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలగా కొనసాగుతున్న విద్యాలయం శత వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో పూర్వ విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. పూర్వపు విద్యార్థుల సంఘం నాయకులు పసల పద్మ రాఘవరావు, దవులూరి సుబ్బారావుల అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో పలువురి పూర్వ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలో ఎంఎల్ఏ నిమ్మకాయల చినరాజప్ప, కూడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధిని కాంక్షిస్తూ దవులూరి దొరబాబు ఆయన తండ్రి పేరిట రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు ప్రభాకర్ రావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, డాక్టర్ పసల సత్యానందరావు, డాక్టర్ చాగంటి సన్యాసిరాజు, గంధం రామకృష్ణ, ఎంద్రు ప్రభాకర్ రావు, గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సీనియర్లను సత్కరిస్తున్న నిర్వాహకులు

అట్టహాసంగా ఫేర్వెల్ డే

ప్రజాశక్తి - తుని

జ్యోతిప్రజ్వలన చేస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసరావు

స్థానిక ఎస్‌వి డిగ్రీ కళాశాలలో ఫేర్వెల్ డేని ఘనంగా నిర్వహించార. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ సిహెచ్. శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించేందుకు క్రీడలు, వివిధ సాంఘిక సంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు తుని, పాయకరావుపేట పరిసర ప్రాంత విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతోనే కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



చైర్‌పర్సన్ మార్పునకు సన్నాహాలు...!

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపల్ కార్యాలయం(ఫైల్ ఫొటో)

సామర్లకోట మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవిని మార్పు చేసే ఆలోచనలో వైసిపి నాయకులు పావులు కదుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడి మార్చి నాటికి 4 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో చివరి సంవత్సరం ఛైర్‌పర్సన్‌ను, రెండవ వైస్ ఛైర్‌పర్సన్‌ను మార్పు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నాలుగేళ్ళ క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఛైర్‌పర్సన్‌గా అప్పటి హౌసింగ్ బోర్డు ఛైర్మన్ దవులూరి దొరబాబు తల్లి ఐదో వార్డ్ వైసిపి కౌన్సిలర్ దవులూరి పార్వతి ఛైర్‌పర్సన్‌గా పదవి చేపట్టాల్సి ఉండగా అప్పట్లో సిఎం వైఎస్ జగన్ ఆదేశాలతో ఒకే కుటుంబంలో రెండు పదవులు ఉండరాదనే నిబంధనతో గంగిరెడ్డి అరుణని ఛైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. మొదటి వైస్ ఛైర్మన్, రెండో వైస్ ఛైర్మన్ పదవులు కూడా దొరబాబు తల్లికి దక్కలేదు. ఆ సమయంలో అయిదేళ్ల పాలన కాలంలో సగం కాలం తరువాత ఛైర్‌పర్సన్‌ను మార్పుచేసే ఒప్పందంతో అరుణకు ఈ పదవిని కట్టబెట్టడం జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన జనరల్ ఎన్నికల్లో వైసిపి ఓటమి పాలు కావడంతో ఈ విషయం ప్రక్కన పడింది. కాగా ప్రస్తుత ఛైర్‌పర్సన్ మార్పు అంశం తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ఛైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న ఒక మహిళా కౌన్సిలర్ ఇతర కౌన్సిలర్లను కలుసుకుని మద్దతు కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మున్సిపాలిటీలోని వైసిపికి 29 మంది, టిడిపికి ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. ఛైర్‌పర్సన్ మార్పు విషయంలో టిడిపి వైఖరి ఎలా ఉంటుందో స్పష్టత లేదు.

గ్రామాల్లో తడి, పొడి చెత్తపై అవగాహన

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ప్రజాశక్తి - కరప

గ్రామాల్లో తడి పొడి చెత్తను సేకరించడంపై అవగాహన కార్యక్రమం ఆదివారం జరిగింది. స్థానిక పంచాయతీలో కార్మికులు ఇంటింటా చెత్తను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సలాది వెంకట శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. చెత్తను సేకరించేటప్పుడు తడి, పొడి చెత్తలను విడివిడిగా తీసుకుని చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. సంపద కేంద్రాలలో కంపోస్ట్ ఎరువులు తయారుచేసి మొక్కలకు ఉపయోగపడే విధంగ ఎరువులు తయారుచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలాదేవి, స్థానికులు పి వీరభద్రరావు, బ్రహ్మానంద, రాంజీ, ఉమామహేశ్వరి, చంద్రకళ, రాజాల సుబ్బలక్ష్మి, వరిజ పాల్గొన్నారు.

లో వోల్టేజ్‌తో తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - గండేపల్లి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్తులు

మండలంలోని మల్లేపల్లి గ్రామంలో విద్యుత్ లో వోల్టేజ్‌తో ప్రజలు నానావస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పలువురు గ్రామస్తులు మా ట్లాడారు. విద్యుత్తు సక్రమంగా సరఫరా కావడం లేదని, దీనికితోడు లో వోల్టేజ్ సమస్యతో టివిలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రిక్ పరికరాలు కాలిపోతున్నాయని అన్నారు. దీని పై పలు దఫాలుగా సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే విద్యుత్ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తితో ఆర్ఐఒ నర్సింహం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థుల పరీక్షలకు రంగం సిద్ధమైంది. థియరీ పరీక్షలు మార్చి1న ప్రారంభమై 20వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియెట్ విద్యా శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఏడాది కూడా సిసి కేంద్రాల పర్యవేక్షణలో పకడ్బందీగా పరీక్షలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆర్ఐఒ ఎన్ఎస్వీఎల్ నర్సింహం పరీక్షల సందర్భంగా వెల్లడించిన వివరాలు..

ఉమ్మడి జిల్లాలో ఎన్ని పరీక్షా కేంద్రాలు

జిల్లావ్యాప్తంగా 51 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాము. గత ఏడాది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రాతిపదికన పరీక్షలను నిర్వహించాము. ఈ ఏడాది కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పు గోదావరి జిల్లాల వారీగా నిర్వహణ బాధ్యతలు కేటాయించాము. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 43,331 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 22,779 మంది కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 20,552 మంది హాజరు కానున్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యానికి అవకాశం లేకుండా పరీక్షా కేంద్రాల్లో వసతులు మౌలిక సదుపాయాలు కల్పించనున్నాము.

పరీక్షల పర్యవేక్షణపై చర్యలు ఏమిటి

ఈ ఏడాది కూడా సిసి కెమేరాల నిఘా నడుమ పరీక్షలు నిర్వహించనున్నాము. అన్ని కేంద్రాల్లో తాగునీరు, మౌలిక వసతులు కల్పించాము. ఉన్నతాధికారులు ఇతర శాఖలతో సమన్వయం చేసి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టడంతో ప్రాథమిక వైద్యం అందించే దిశగా చర్యలు చేపట్టనున్నాము. ఇన్విజిలేటర్లు సహా ఎవరూ పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లేందుకు అవకాశం లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

సమయ పాలనపై నిబంధనలు ఏమిటి

మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ పరీక్షలు జరుగనున్నాయి. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలను నిర్వహించనున్నాము. విద్యార్థులందరూ కచ్చితమైన సమయపాలన పాటించాలి. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రానికి అనుమతించే అవకాశం లేదు. కావున విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. ఆ దిశగా రవాణా ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలి. ఒక రోజు ముందుగానే పరీక్షా కేంద్రాలను సందర్శించి నిర్ధారించుకోవాలని సూచిస్తున్నాము. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలలో ప్రతిభను కనబర్చాలి.

సమస్యాత్మక కేంద్రాల వద్ద చర్యలు ఏమిటి

జిల్లాలోని సమస్యాత్మక 5 కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాము. ఈ కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు పోలీసు శాఖ సహకారంతో ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నాము. పరీక్షల నిర్వహణలో ఇన్విజిలేటర్లతో పాటు 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఎక్కడికక్కడే సిట్టింగ్ స్క్వాడ్‌లను కేటాయించాము. వారు నిరంతరం పర్యవేక్షిస్తారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల సెట్లను స్టోరేజ్ కేంద్రాలకు పంపించనున్నాము. ఫీజు బకాయిలు చెల్లించలేదనే కారణంగా హాల్ టిక్కెట్లు పంపిణీ నిలపవద్దని ప్రైవేటు కళాశాలలకు ఆదేశించాం.

విద్యార్థులకు సకాలంలో హాల్ టికెట్లు జారీ చేయాలని జిల్లాలోని అన్ని కళాశాలల మేనేజ్‌మెంట్‌లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాము. ఇంకా ఎవరైనా తీసుకోని విద్యార్థులు ఉంటే కళాశాల ప్రిన్సిపల్‌ను కలిసి తీసుకోవాలి ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్ ఇస్తామంటూ ఇబ్బంది పెడితే ఇంటర్మీడియెట్ విద్యా శాఖ బోర్డుకు ఫిర్యాదు చేయొచ్చు. అటువంటి యాజమాన్యాలపై క్రమశిక్షణ చర్యలు తప్పవు.

రీజియన్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రమేష్ రాజు

సేవాస్ఫూర్తితో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రతి లయన్స్ క్లబ్ సభ్యుడు సేవాస్ఫూర్తితో ముందుకు సాగాలని పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్మన్ రమేష్‌రాజు అన్నారు. ఆదివారం స్థానిక సూర్య భాస్కర కళ్యాణ మండపంలో లావణ్య శ్రీనివాసం పేరుతో లయన్స్ క్లబ్ రీజనల్ కాన్ఫరెన్స్ రీజియన్ ఛైర్‌పర్సన్ బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైన్స్ క్లబ్‌ను ప్రతి సభ్యుడు తన కుటుంబంగా భావించాలని అన్నారు. రీజియన్ ఛైర్‌పర్సన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రీజియన్‌లో ఏడు నెలల కాలంలో 800 సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గంగవరం, యానాం, కనకాల పేట నూతన క్లబ్‌లు ఏర్పాటు చేశామని అన్నారు. లయన్స్ క్లబ్ మూల నిధికి రూ.7 వేల డాలర్లు సమకూర్చడమే కాకుండా, విజయవాడ వరద బాధితులకు రూ.7 లక్షలు వసూలు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించి నట్లు తెలిపారు. మార్చి 22, 23 తేదీల్లో తాళ్లరేవు, కాపులపాలెం క్లబ్బుల ద్వారా నిర్వహించే జిల్లా కాన్ఫరెన్స్‌కు సహకరించాలని కోరారు. సేవలందించిన క్లబ్‌లకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బాదం బాలకృష్ణ, వైఎస్ఆర్.శర్మ, దాసరి తిరుమల రావు, లింగమల్లు కృష్ణమూర్తి, శేఠ్ అనిల్‌కుమార్, మంజులూరి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి ఈతకోట జాతీయ రహదారి కల్వర్టు చెంత పంటకాలువలో ఆదివారం అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ చంటి తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం .. ఒడిశా రాష్ట్రం మైర్ బంచ్ జిల్లా గొలగాడియా మండలం బడాబిసాల్ గ్రామానికి చెందిన బిసునాథ్ బాస్కె (40) గోపాలపురం అవంతి సీఫుడ్స్ కంపెనీలో పని చేస్తున్నాడన్నారు. అతను శనివారం కూడా పనిచేశాడని, అయితే ఆదివారం ఈతకోట అవంతీ కంపెనీలో సమీపంలో గల జాతీయ రహదారి చెంత గల కల్వర్టు కింద పంటకాలువలో శవమై కనిపించాడన్నారు. బాస్కె మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ప్లీడర్ల వీధిలోని బేసా సురేష్ ఇంటిలో దొంగలు పడి 250 గ్రాముల వెండి సామాగ్రి, రెండు కాసుల బంగారు ఆభరణాలు, సుమారు లక్ష రూపాయలు నగదు దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. లలిత ఇండస్ట్రీస్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సురేష్ శనివారం రాత్రి డ్యూటీ నిమిత్తం ఫ్యాక్టరీకి వెళ్ళగా కుటుంబ సభ్యులు ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటిలో ఫంక్షన్‌కు వెళ్లారు. ఉదయం తిరిగి వచ్చి చూడగా ఈ సామాగ్రి, నగదు దొంగిలించినట్లు గుర్తించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఇన్‌ఛార్జ్ సిఐ కృష్ణభగవాన్, ఎస్ఐ వి.మౌనిక సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మురుగు కాలువలో వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కుమ్మరి వీధి సెంటర్ జి.రాగంపేట పుంత రహదారి వద్ద మురుగు నీటి కాలువలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. ఆదివారం సంఘటనా స్థలాన్ని ఇన్‌ఛార్జ్ సిఐ కృష్ణభగవాన్, ఎస్ఐ వి.మౌనిక పరిశీలించారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మరణించిన వ్యక్తి వివరాలు ఇంకా తెలియాల్సివుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - చాగల్లు

మార్కొండపాడు గ్రామ శివారులో ఆదివారం పేకాడుతున్న వారిపై ఎస్ఐ కె.నరేంద్ర తన సిబ్బందితో దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుండి రూ.14,750 నగదు స్వాధీనపరుచుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సమస్యలకు నిలయం.. అగ్నిమాపక కేంద్రం

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- పాత బడిన అగ్నిమాపక యంత్రాలు
- లీకవుతున్న పాతభవనం

అలంకారప్రాయంగా ఉన్న రామచంద్రపురం ఫైర్ స్టేషన్

ప్రజాశక్తి - రామచంద్రపురం

అగ్ని ప్రమాదాలు సంభవించడం వెంటనే ఠక్కున గుర్తొచ్చేది అగ్ని ప్రమాద వాహనం. సామాన్యులు మధ్యతరగతి ప్రజలు అనే తేడా లేకుండా అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్ కు ఫోన్ చేయడం పరిపాటి. అయితే అగ్నిమాపక యంత్రాలు గత 15 ఏళ్లుగా పాతబడిపోవడంతో పాటు సిబ్బంది కొరతతో సతమతమవుతున్నాయి. ముఖ్యంగా డ్రైవర్ల కొరత, ఫైర్ ఇంజన్లను కదలకుండా ఆటంకం కలగజేస్తున్నాయి. రామచంద్రపురంలో గల ఫైర్ స్టేషన్ 1982లో నిర్మించారు. సుమారు 45 సంవత్సరాలు కావస్తున్న ఈ అగ్రిమాపక కేంద్రానికి సరైన భవనం లేకపోవడంతో ఉన్న భవనంతోనే సర్దుకుంటున్నారు. దీంతోపాటు వాహనం కదిలేనందుకు రోడ్డు మార్గం కూడా సరిగా లేక సిబ్బంది ఇక్కట్లకు గురవుతున్నారు. ఇక ఈ ఫైర్‌స్టేషన్‌లో గత నెల రోజులుగా ఒకే డ్రైవర్ ఉండటంతో వాహనం బయటకు వెళ్లేందుకు నెలలో 15 రోజులు మాత్రమే సాధ్యమవుతుంది దీంతో ప్రమాదాలు జరిగిన వెంటనే స్థానికంగా ఉన్న ఫైర్ ఇంజన్ బదులు వేరే ఫైరింజన్లను పంపించవలసిన పరిస్థితి ఏర్పడింది.

ఆంధ్రప్రదేశ్లో మొత్తం 230 వరకు ఫైరింజనులు అందుబాటులో ఉన్నాయి. అయితే 15 ఏళ్లుగా పాత వాహనాలనే రామచంద్రపురంలో నేటికీ వినియోగించడం విశేషం. ఇక ప్రతి ఫైర్ స్టేషన్లను ముగ్గురు డ్రైవర్లు ఉండాల్సి ఉంది. అయితే రామచంద్రపురం లో కేవలం ఒకే డ్రైవరు ఉండటంతో అతను 24 గంటలు డ్యూటీ చేయడంతో మరుసటి రోజు వాహనం కదిలే పరిస్థితి లేదు. ఇక అత్యవసర పరిస్థితుల్లో వేరే ఫైర్ స్టేషన్లకు సంప్రదించాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా 9 మంది ఫైర్ మాన్ లు, ముగ్గురు సహాయ సిబ్బంది, ఒక ఎఫ్ఓ ప్రతి స్టేషన్ లోనూ ఉండాలి. మొత్తం 16 మంది ఒక ఫైర్ స్టేషన్‌లో పని చేయవలసి ఉండగా రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది కొరత ఉన్నట్లు స్థానికులు తెలియజేస్తున్నారు. సిబ్బంది కొరతతో హోంగార్డులను ఇక్కడ వినియోగిస్తున్నారు.

రోడ్డు సదుపాయం లేని ఫైర్ స్టేషన్

రామచంద్రపురంలో ఇటీవల చోటు చేసుకున్న ఒక అగ్ని ప్రమాదంలో మండపేట నుంచి ఫైర్ ఇంజన్ రప్పించవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇదే విధానం కొనసాగితే అత్యవసర పరిస్థితుల్లో ఫైర్ ఇంజన్ 30 కి.మీ దూరం నుంచి రావాలంటే తీవ్ర నష్టం వాటిల్లుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కొత్త వాహనాలను ఏర్పాటు చేయాలని, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలని, కొత్త వాహనాలు ఏర్పాటు చేయాలని, ఫైర్ స్టేషన్ ఆధునికరించి లీక్ అవుతున్న పాత భవనాన్ని తొలగించాలని, ఫైర్ స్టేషన్‌కు అవసరమైన రోడ్డు సదుపాయం ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులకు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

డ్రైవర్ల కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు

రామచంద్రపురం ఫైర్ స్టేషన్‌లో ఇద్దరు డ్రైవర్లకు ఒక డ్రైవర్ ఇటీవల సస్పెండ్ అయ్యారు. దీంతో ప్రస్తుతం ఒకే డ్రైవర్ ఉన్నారు. మొత్తం ముగ్గురు డ్రైవర్లు ఉండాల్సి ఉండగా ఒకే డ్రైవర్ తో సర్దుకుపోతున్నాము. దీంతో నెలలో 15 రోజులు వాహనం కదలని పరిస్థితి. అదేవిధంగా 2019 నుంచి ఎప్పటి వరకు రిక్రూట్మెంట్లు జరగకపోవడంతో ఫైర్ స్టేషన్లలో సిబ్బంది కొరత ఏర్పడింది. 1982లో నిర్మించిన తమ భవనం శిథిలావస్థక చేరుకుని లీక్ అవుతోందని, ప్రహరీలు కూలిపోయాయని వీటిని మరమ్మతులు జరిపించి ఆధునిక భవనం నిర్మించాల్సి ఉందని పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. ప్రస్తుతం అత్యవసర పరిస్థితుల్లో మండపేట, రాయవరం, అమలాపురం ఫైర్ ఇంజన్లను ఉపయోగించుకోవలసి వస్తోంది.

-నాగేశ్వరరావు స్టేషన్ ఫైర్ అధికారి, రామచంద్రపురం

అన్నదానం సామగ్రి బహూకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ప్రతి ఆదివారం నిర్వహించే అన్నదానం నిమిత్తం పెద్దాపురం పట్టణానికి చెందిన దాతలు సామగ్రి బహూకరించారు. కంచి కామాక్షి సప్ల యర్స్ ఆధ్వర్యంలో స్టీల్ డ్రమ్ము, లంకాటి రాంబాబు అన్నం వడ్డన సామగ్రి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మికి అందజేశారు.

మహారాజశ్రీ కాకినాడ 6వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S.No. 323 / 2018
Between:
1) నున్న వెంకటేశ్వరరావు
2) పూసర్ల మణి ...అప్పిలెంట్స్
మరియు
బత్రేటి స్వామి (died) & 25 others...రెస్పాండెంట్స్
To: రెస్పాండెంట్స్:
R2: బత్రేటి సత్తిబాబు, S/o. (లేటు) స్వామి, కరప గ్రామం, కరప మండలం, కాకినాడ జిల్లా.
R4: కేదారిశెట్టి సూర్యనారాయణ మూర్తి, S/o. లేటు తమ్మయ్య, పిఠాపురం, కాకినాడ జిల్లా.
R5: కేదారిశెట్టి కామేశ్వరరావు, S/o. (లేటు) తమ్మయ్య, పిఠాపురం, కాకినాడ జిల్లా.
R6: కేదారిశెట్టి చంద్ర గుప్త, S/o. (లేటు) తమ్మయ్య, పిఠాపురం, కాకినాడ జిల్లా.
R8: కాపుగంటి మంగతాయారు, W/o. కొండలరావు, మెయిన్‌రోడ్డు, స్టేట్‌బ్యాంక్ ప్రక్కన, కాకినాడ.
R9: కేదారిశెట్టి ఉమా మహేశ్వరి, W/o. (లేటు) తమ్మయ్య, మెయిన్‌రోడ్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం.
R10: ఉప్పలపాటి మాచరిరావు, S/o. వీర్రాజు. మెయిన్‌రోడ్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం.
R11: నున్న పుష్పావతి, W/o. వెంకట సుబ్బారావు, మెయిన్‌రోడ్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం.
R12: నార్కెడమిల్లి మాణిక్యాలరావు, S/o. భాస్కరరావు, మునసబుగారి తూము దగ్గర, జగన్నాయక్‌పూర్, కాకినాడ-2
R13: నార్కెడమిల్లి విష్ణుబాబు, S/o. భాస్కరరావు, మునసబు గారి తూము దగ్గర, జగన్నాయక్‌పూర్, కాకినాడ-2
R14: నార్కెడమిల్లి రాంబాబు, S/o. భాస్కరరావు, మునసబుగారి తూము దగ్గర, జగన్నాయక్‌పూర్, కాకినాడ-2
R15: నార్కెడమిల్లి వేణుగోపాలరావు, S/o. భాస్కరరావు, మునసబుగారి తూము దగ్గర, జగన్నాయక్‌పూర్, కాకినాడ-2
R16: నార్కెడమిల్లి పార్వతి, D/o.Not Known, మునసబుగారి తూము దగ్గర, జగన్నాయక్‌పూర్, కాకినాడ-2
R17: నార్కెడమిల్లి లలిత, D/o. భాస్కరరావు, C/o. మాణిక్యాలరావు, మునసబుగారి తూము దగ్గర, జగన్నాయక్‌పూర్, కాకినాడ-2.
R20: నున్న సత్యవతి, W/o. వెంకట సుబ్బారావు, కరప గ్రామం, కరప మండలం, కాకినాడ జిల్లా.
R21: సలాది వెంకటేశ్వరరావు, S/o. బాపనయ్య, భక్తాంజనేయ వీధి, కరప గ్రామం, కరప మండలం, కాకినాడ జిల్లా.
R22: వెలమర్తి రామారావు, S/o. లక్ష్మణమూర్తి, భారతి బుక్స్ & స్టేషనరీ ఎదురుగా, పూర్ణామార్కెట్, విశాఖపట్నం.
R23: వెలమర్తి లక్ష్మణగుప్త, S/o. రామారావు, భారతి బుక్స్ & స్టేషనరీ ఎదురుగా, పూర్ణామార్కెట్, విశాఖపట్నం.
R25: వెలమర్తి సతీష్, S/o. రామారావు, భారతి బుక్స్ & స్టేషనరీ ఎదురుగా, పూర్ణామార్కెట్, విశాఖపట్నం.
పై నెంబరు అప్పీలు యందు అపీలుదార్లు దాఖలుచేసిన అపీలు దావాలో మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు మీకు పంపినప్పటికి, రెస్పాండెంట్స్ అయిన మీరు తీసుకొనియుండ లేదు. కావున సదరు అపీలు దావా మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.**06-03-2025** తేదీనాటికి వాయిదా వేసియున్నారు. కావున సదరు రోజున ఉదయం గం॥ **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు యున్న యెడల మీరు తెలుపుకొనవచ్చును. లేనియెడల పై అపీలు దావా విషయము కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
A.V.V. సత్యనారాయణ
అడ్వకేటు, డో.నెం.8-13/3-2/3, శ్రీనిలయం,
కాకినాడ రాజప్రకాష్ వీధి, ప్రతాప్‌నగర్, కాకినాడ
తేది.13-02-2025 సెల్: 6301204436

సమావేశంలో మాట్లాడుతున్న ఇఒ నీలకంఠం

మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వరాలయంలో ఈనెల 24వ తేదీ నుంచి జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ ప్రత్యేక అధికారి టి.సూర్యనారాయణ, ఆలయ ఇఒ బల్ల నీలకంఠం చెప్పారు. ఆదివారం ఉత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహాశివరాత్రి రోజున స్వామి వారి దర్శనానికి భక్తులు ఏ విధంగానూ ఇబ్బంది పడకుండా అందరికీ ఒకే పద్ధతిలో దర్శనాలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎవరికి ఎలాంటి పాస్‌లు జారీ చేయడం లేదన్నారు. ఆలయం ముఖ ద్వారం వద్ద, క్యూ లైన్‌లలో స్థానిక పోలీసులను కాకుండా వేరే ప్రాంతాల నుంచి వచ్చే సిబ్బందిని నియమిస్తున్నట్లు చెప్పారు. స్నాన ఘట్టాల వద్ద, గర్భాలయంలో దర్శనాలు వద్ద, క్యూలైన్ల వద్ద భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం చేసినట్టు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం దేవదాయ శాఖ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్, ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

అల్లవరం: గోడి శ్రీ ఆనంద బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో మహాశివరాత్రి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆశ్రమం కమిటీ అధ్యక్షులు తోట నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీ ఆనంద బాలయోగీశ్వరుల స్వామి గోడి గ్రామంలో 1961 సంవత్సరం నుంచి తపస్సు చేస్తూ యాత్రికులకు దర్శనం ఇస్తుండేవారన్నారు. 5 సంవత్సరాలు తపస్సు చేస్తూ 1976 లో ఆయన మరణించిన చేసిన ప్రదేశంలో ఆయన సమాధితో ఆలయం ఏర్పడిందన్నారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి రోజున స్వామి సమాధిని యాత్రికులు దర్శించుకుంటున్నారన్నారు. మహాశివరాత్రి రోజున పూజా కార్యక్రమాలు, తీర్థమహోత్సవాలు, అన్నదానం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బళ్ళ రాజు, సెక్రటరీ తోట నరసింహం, జయింట్ సెక్రటరీ బళ్ల సత్యనారాయణ, ట్రెజరర్ పరమట నాగలక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న తాగునీరు

రోడ్డు పనులకు తాగునీటి వినియోగం..!

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అందించే తాగునీటిని వినియోగించడం చర్చనీయాంశంగా మారింది. అసలే వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పేట్టు లేదు. ఇటీవల పట్టణ పరిధిలో రహదారి నిర్మాణ పనులను జోరుగా చేపడుతున్నారు. అయితే రోడ్ల పనులకు ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని వినియోగిస్తూ సంబంధిత కాంట్రాక్టర్లు వృధా చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రోడ్డు కాంట్రాక్టర్లు రోజుకు సుమారు 30 నుంచి 40 ట్రాక్టర్ ట్యాంకర్ల నీటిని ఏ ఖర్చు లేకుండా వాడేస్తున్నారు. సుమారు 6 వార్డుల ప్రజలకు సరఫరా చేసే నీటిని వినియోగిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన సత్తెమ్మ జాతర

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలోని సిహెచ్.గున్నేపల్లిలో వెంచేసి ఉన్న సత్తమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జాతర కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమాలు యాత్రికులను విశేషం గా ఆకట్టుకున్నాయి. ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభమైన సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారంతో జరిగిన తీర్థం తో ఘనంగా ముగుశాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం అంతా యాత్రికులతో కిటకిటలాడింది. ఈ జాతర మహోత్సవాల సందర్భంగా నిర్వాహక కమిటీ వందలాది మంది కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా గరగ నృత్యాలు, కోలాటం, వివిధ రకాల విచిత్ర వేష ధారణలు, గిరిజన వేష ధారణ లో సాంప్రదాయా ప్రదర్శనలు యాత్రికులను విశేషం గా ఆకట్టుకున్నాయి. జాతరను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సిఐ మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాల సాగర్ పల్లంకుర్రు వెళ్లే ప్రధాన రహదారి పై రాకపోకలను అనాతవరం వైపు నుంచి మళ్లించి.పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిన్నారికి తులాభారం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర లో అలివేలుమంగా గోదాదేవి సమేత వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం చిన్నారి తులాభారం ఘనంగా జరిగింది. ద్రాక్షారామం కు చెందిన పసుమర్తి అనిల్, విరిసా దంపతుల మూడు నెలలు చిన్నారికి పటిక బెల్లం తో తులాభారం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు కె.బాల బాలాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - మామిడికుదురు

లూటుకుర్రు లో నిర్మించిన ఆలయంలో ఆదివారం పోల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాదంపూడి సోమేశ్వర శర్మ బ్రహ్మత్వం లో పూజ్యం జగన్నాథ శర్మ, విశ్వనాథ శర్మ, మానేపల్లి భాస్కర శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్టాపన విగ్రహ జరిగింది. గోకవరపు గణాధిపతి లక్ష్మీ సరోజ, పెరుమాల స్వామి శ్రీవిద్య దంపతులు కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు.

ధనమ్మ అమ్మవారిని దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని కేదార్లంక శివారు వీధి వారి లంక గ్రామంలో ఉన్న ఊడల మర్రి కింద వెలసిన శ్రీ ధనమ్మ అమ్మవారిని యాత్రికులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ అమ్మవారిని దర్శించుకునేందుకు సుదీర ప్రాంతాలనుంచి యాత్రికులు కుటుంబ సమేతంగా తరలివచ్చి మొక్కుబడులు చెల్లించారు. పెద్ద వక్షం లో వెలసిన ఈ అమ్మవారిని తిలకించేందుకు కపిలేశ్వరపురం మండల ప్రజలు గోదావరి పడవ మార్గం ద్వారా వస్తూ ఉంటారు. అనేక ప్రాంతాలైన రాజోలు, అమలాపురం, గన్నవరం, కొత్తపేట రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు బోడిపాలెం వంతెన మీదుగా అమ్మవారి దర్శనానికి వచ్చి ఇక్కడే వంటావార్పు చేసుకుంటారు. ధనమ్మ మర్రి వద్ద ఉదయం నుండి సాయంకాలం వరకు పెద్దలు యువకులు పిల్లాపాపలతో సందడి చేశారు

ధనమ్మ తల్లి మర్రి వద్ద వంటలు నిర్వహిస్తున్న మహిళలు

ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినది

ఉమ్మిత్త అశోకవర్ధన్ S/o ఆకులు (లేటు), శ్రీ బద్రమహాంకాళీ నగర్5వ వీధి చివరి హౌస్ వాస్తవ్యుడను అను నేను మా యింటి వద్ద నుండి రావులపాలెం సెంటరుకు నా కుమార్తె ఉమ్మిత్త మేఘన సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలు తీయించుటకు వెళ్ళిన సందర్భంలో రావులపాలెం లో OAKRIDGE-Internationanal school విశాఖపట్నం, ఇంటర్మీడియట్ టి.సి. ఒరిజినల్ మరియు ఇతర సర్టిఫికెట్స్ జెరాక్స్ కాపీలు పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియపరచవలసినదిగా కోరి ప్రార్థిస్తున్నాను. తగిన పారితోషికం యివ్వబడును.

ఉమ్మిత్త అశోకవర్ధన్
S/o ఆకులు (లేటు)
సెల్ : 9866170108

దస్తావేజులు పోయినవి

కాకినాడ జిల్లా, తొండంగి మండలం, పెరుమాళ్ళపురం గ్రామ కాపురస్తులు కొయ్యా తాతబ్బాయి గారి కుమారుడు కొయ్యా శివరావు అనేను నేను ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా నేను **ది.వి. 5-1-2025** మరియు **ది. 6-1-2025** తేదీలలో నా మోటారు సైకిల్పై ఇతర ప్రాంతములకు (తొండంగి, తుని ఏరియాలో) వెళుచుండగా నాయొక్క ఎరుపు బ్యాగు దస్తావేజులు మరియు కాకినాడ కాపురస్తులు వల్లూరి వెంకటచటం గారి కుమారుడు శ్రీనివాసరావు గారి సంతకములతో కూడి '7' ఖాళీ ప్రో నోట్లు మరియు ఒక (1) దస్తావేజు స్టాంపు, నా తాలూకు బ్యాంక్ చెక్కుబుక్‌తో పడిపోయినది. ఎవరికైన లభ్యమైనయెడల నాకు యీ దిగువ అడ్రస్సుకు తెలియబరిచిన యెడల తగిన బహుమతి ఇచ్చి తీసుకొనగలవాడను.

ఇట్లు
కొయ్యా శివరావు
తండ్రి : తాతబ్బాయి
పెరుమాళ్ళపురం
తేది: 26-01-2025
స్థలం : పెరుమాళ్ళపురం సెల్9492572144

ప్రకటన



కీ.శే. జల్లి నాగరత్నం (లేటు)

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలం , తాండవపల్లి గ్రామ కాపరస్తులు **జల్లి సర్దార్ బాబు** S/o సాహెబ్ (లేటు) గారు వ్రాయించి ఇచ్చిన ప్రకటన.నా తల్లిగారు జల్లి నాగరత్నం W/o సాహెబ్ తాండవపల్లి గ్రామంలో మా ఇంటి వద్ద **ది.18-05-2001** సంవత్సరంలో మరణించారు. వీరి మరణం గ్రామ పంచాయితీలో నమోదుకాలేదు. ఏమైన అభ్యంతరాలు ఉన్న యెడల పది రోజులలో తెలియజేయగు.

జల్లి సర్దార్ బాబు
S/o సాహెబ్, డోర్ నెంబర్ 1-148,
తాండవపల్లి గ్రామం
అమలాపురంమండలం
సెల్: 79933 17764

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.P. 17/2024
కొండేపూడి శ్రీనివాస్S/o.చంద్రరావు,కోటపాడు, రంగంపేట మండలం. ...**పిటిషనర్**
1. శింగన సుబ్బారావు S/o.Late వీర్రాజు, Dr.No.10-11-10/6 నాగంపేట, పెద్దాపురం.
2. ముత్యం భాస్కరరావు S/o. సత్తిబాబు,, Dr.No.1-116, కోటపాడు, రంగంపేట మండలం.
3. ముద్రగడ రాము S/o.రాంబాబు, Dr.No.4-35, దామిరెడ్డిపాలెం, కడియం మండలం.
4.కోసూరి సత్యనారాయణ S/o.వెంకటేశ్వరరావు, సుబ్రరంపేట,రంగంపేటమండలం ...**రెస్పాండెంట్లు**
5. The Official Receiver, District Court complex, Rajahmahendravaram.
పై నంబరు గ్రందములో పిటిషనరు , రెస్పాండెంట్లు కు సొమ్ముబకాయి పడియుండి సదరు బకాయిలు తీర్చలేని పరిస్థితులలో తనను Insolvent గా డిక్లేర్ చేయమని పై కోర్టు వారి ఎదుట పిటిషను దాఖలు చేసినందున ఎవరికైన ఎట్టి అభ్యంతరములు వున్న యెడల పై కోర్టు వారి ఎదుట **దివి.28-02-2025** సంవత్సరం తేదీన ఉదయం **10.30** గం॥లక స్వయముగా గాని , ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తమ అభ్యంతరములు తెలియ పరచుకోవలెను.
DVS రవికుమార్
అడ్వకేట్, పెద్దాపురం.
9849648096